
సాక్షి గుంటూరు

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



సీతారామలక్ష్మణులకు వెండి వస్త్రాలు

మాచర్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న కోదండ రామాలయంలో రామలక్ష్మణులకు వెండి పంచెలు, సీతమ్మకి వెండి చీర సమర్పించారు. ఎమ్మెల్యే జూలకంటి పాల్గొన్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 7508 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 340 క్యూసెక్కులు వదిలారు.



గ్రామదేవతలకు బోనాలు సమర్పణ

దాచేపల్లి: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో అంకమ్మ తల్లి, గంగమ్మ తల్లికి గురువారం బోనాలు సమర్పించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



తాడేపల్లి రూరల్: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలని రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. దుగ్గిరాల మండల పరిషత్ పాఠశాల (నార్త్) ఆవరణలోని అంగన్‌వాడీ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. సెంటర్‌లో పిల్లల ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతం నమోదును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వంటల్లో తప్పనిసరిగా అయోడైజ్డ్ ఉప్పును మాత్రమే వాడాలని ఆదేశించారు. కార్యక్రమంలో దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సి. ఇందిర, హెల్త్ ఎడ్యుకేటర్ వి. సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, ఆరోగ్య కార్యకర్తలు లీల, శ్యామల, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్త విజయ లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

14న జాతీయ మెగా లోక్ అదాలత్

నగరంపాలెం: వచ్చేనెల 14వ తేదీన జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ మెగా లోక్‌అదాలత్ జరగనుందని ఎస్పీ సతీష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి ఇరు పక్షాలకు కౌన్సెలింగ్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. రాజీ పడే క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాల కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించే దిశగా చూడాలన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు కక్షిదారులు ముందుకు రావాలని తెలిపారు.


ఈవీఎంల పరిశీలన

39 వీవీ ప్యాడ్స్‌కు మరమ్మతులు



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా ఇంచార్జి ఆర్డీవో గంగరాజు గురువారం పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. మరమ్మతులకు గురైన 39 వీవీ ప్యాడ్స్‌ను కంటైనర్‌లో బెంగుళూరులోని బెల్ కంపెనీకి పంపిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట గుంటూరు తహసీల్దార్ నగేష్, ఇంచార్జి తహసీల్దార్ రాజా రమేష్ మోహన్, నియోజకవర్గాల రెవెన్యూ సిబ్బంది, నాయకులు ఎం.శివరామిరెడ్డి, ఆరె పున్నారెడ్డి, పి.చిన్న, రామమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యార్డుకు 56,735 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 56,735 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 55,261 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 22,347 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా ఘటనలో చట్టాలలోని లొసుగులతో నిందితులు తప్పించుకునే ఆస్కారం ఉంది. వాటిని మార్చి అయినా నిందితులకు కఠినంగా శిక్షించాలి. మహిళ చనిపోయిన తర్వాత మానభంగం చేస్తే శిక్ష లేదనే సాకు చూపి తప్పించుకునే అవకాశముంది. తల్లిదండ్రులు కూడా పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలతో మహిళలు, యువతులు బయటకు రాలేని పరిస్థితులు పెరుగుతాయి. నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది.

- డాక్టర్ గీతా మాధురి, మంగళగిరి



మహిళల్లో అభద్రతా భావం



కోల్‌కతా వంటి ఘటనలతో మహిళల్లో అభద్రతా భావం నెలకొంటుంది. ఒంటరి యువతిపై అందులోనూ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేయడం దారుణం. నిందితుల్లో ఎంతటి పెద్దవారున్నా కఠినంగా శిక్షించాలి. నిందితుల అరెస్టులో ప్రభుత్వ తాత్సారం తగదు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల్లో భరోసా నింపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

-డాక్టర్ సాయిప్రసాద్, పిల్లల వైద్య నిపుణులు

ప్రైవేటుకు ప్రభుత్వ స్థలాల నైవేద్యం

- పన్ను వేసి మరీ ధారాదత్తం
- నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారుల అత్యుత్సాహం
- నోరుమెదపని ఉన్నతాధికారులు



నగరపాలక సంస్థ కార్యాలయం

> **పరిశీలిస్తాం**
>
> కాకాని రోడ్డులో యూఎల్సీ ల్యాండ్‌కు టాక్స్ వేసిన విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలిస్తాం.
>
> - వెంకటలక్ష్మి, డీసీ-1

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారుల లీలలు చూస్తే విస్తుపోక తప్పదు. ప్రభుత్వ స్థలాలకు (అర్బన్ సీలింగ్ ల్యాండ్)కు పన్నులు వేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. తద్వారా రూ. లక్షల్లో అక్రమార్జన ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో ఇంత జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సదరు అధికారులు తీరు ఆడింది ఆట..పాడింది పాటగా మారింది.

ఇవిగో ఉదాహరణలు

కాకాని రోడ్డులో 10 ఎకరాల ఓ వాణిజ్య సముదాయం ఉంది. ఇందులో నాలుగున్నర ఎకరాల స్థలంలో లే అవుట్ వేసేందుకు యజమానులు నగరపాలక సంస్థకు దరఖాస్తు చేసుకున్నారు. సదరు స్థలం ఇండస్ట్రియల్ జోన్‌లో కొంత.. మరికొంత అర్బన్ ల్యాండ్ సీలింగ్(యూఎల్‌సీ)లో ఉంది. లే అవుట్‌కి అనుమతులు మంజూరు కావాలంటే ముందుగా వీఎల్‌టీ(వేకెంట్ ల్యాండ్ ల్యాక్స్) విధించాల్సి ఉంటుంది. అయితే రెవెన్యూ అధికారులు ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే 2023లో సదరు భూ యాజమానుల నుంచి భారీ మొత్తంలో నగదు దండుకున్నారు. 10 ఎకరాలకు వేయకుండా కేవలం నాలుగున్నర ఎకరాలకు(ఎకరాల నుంచి గజాల్లోకి మార్చి) వేశారు. రూ.50లక్షలు ట్యాక్స్ వేసి చేతులు దులుపుకున్నారు. ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా పన్ను విధించినందుకు ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం గండిపడింది.

- ముత్యాలరెడ్డి నగర్ ఎక్స్‌టెన్షన్ శాంతీనగర్ సొసైటీ దగ్గర దేవదాయ శాఖకు సంబంధించి స్థలానికి కూడా రెవెన్యూ అధికారులు వీఎల్‌టీ వేశారు. ఆ తరువాత సదరు స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించారు. నిర్మాణం తరువాత టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చే ఓసీ(ఆక్యుపెన్సీ సర్టిఫికేట్) కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి

సుమారు నాలుగున్నర ఎకరాల స్థలంలో లేఅవుట్ అప్రూవ్ కోసం దరఖాస్తు రావడంపై అప్పటి నగర కమిషనర్ కీర్తి చేకూరి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దీనిపై టౌన్ సర్వే రిమార్క్ ఇవ్వాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సర్వే రిమార్క్స్‌లో నాలుగున్నర ఎకరాల స్థలంలో కొంత భాగం అర్బన్ ల్యాండ్ సీలింగ్(యూఎల్‌సీ)లో ఉందని తేలింది. దీంతో కమిషనర్ లే అవుట్ అప్రూవల్‌ను తిరస్కరించారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ అని తెలియకుండానే రెవెన్యూ అధికారులు వేసిన వీఎల్‌టీకి సంబంధించిన రూ.50లక్షలు స్థల యజమానులు నగరపాలక సంస్థకు జమ చేశారు. అయినప్పటికీ లే అవుట్ అప్రూవ్ రాకపోవడంతో యజమానులు నగరపాలక సంస్థ అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.50లక్షలు డీడీ కూడా మాయం ?

స్థల యాజమానులు వీఎల్‌టీ కింద వేసిన ట్యాక్స్ రూ.50లక్షలు కార్పొరేషన్‌కు డీడీ రూపంలో చెల్లించినట్లు సమాచారం. సదరు డీడీ రెండు, మూడు రోజుల్లో కమిషనర్ అకౌంట్‌కి జమ అవుతుంది. డీడీ ఇచ్చిన రోజే పన్ను చెల్లించిన వారికి కట్టినట్లుగా రశీదు ఇచ్చేస్తారు. అయితే ఇక్కడ కొసమెరుపు ఏమిటంటే సదరు రూ.50లక్షలు డీడీ కమిషనర్ ఖాతాకు జమ కాలేదని ఆరోపణలు వస్తున్నాయి. స్థల యజమానులతో ముందుగానే మాట్లాడుకుని డీడీని తిరిగి పార్టీకి రిటన్ చేసి, వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. సదరు డీడీనీ ఈఆర్‌పీ సైట్‌లో ఆప్‌డేట్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఇదే తరహా మోసం జరిగితే మేయర్ కావటి మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై లోతుగా విచారణ చేపడితే కొత్త విషయాలు బయటకు వచ్చే అవకాశం లేకపోలేదు.

సర్వే రిపోర్టు ఉంటేనే వీఎల్‌టీ..

2018వ సంవత్సరానికి ముందు రెవెన్యూ అధికారులు కొన్ని ప్రభుత్వ స్థలాలకు, ఎండోమెంట్ భూములకు వెకేంట్ ల్యాండ్ ట్యాక్స్ విధించడంతో దీనిపై కోర్టు కేసులు నమోదు అయి నగరపాలక సంస్థకు తలనొప్పిగా మారింది. దీంతో 2018లో అప్పటి నగర కమిషనర్‌గా ఉన్న శ్రీకేష్ లత్కర్ చర్యలు తీసుకున్నారు. మే,14, 2018న నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలకు పన్ను విధించాలంటే తప్పనిసరిగా టౌన్ సర్వే రిపోర్టు ఉంటేనే విధించాలని కచ్చితమైన రూల్స్ పాస్ చేశారు. కానీ రెవెన్యూ అధికారులు ఎటువంటి రిపోర్టు లేకుండానే పైన ఉదహరించిన స్థలాలకు వీఎల్‌టీ వేసి, వారికి హక్కు కల్పించిన వారయ్యారు.

నేడు పల్నాడుకు సీఎం చంద్రబాబు



ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠికి ఏర్పాట్లు వివరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం వన మహోత్సవంలో పాల్గొనేందుకు నరసరావుపేట రానున్నారు. హెలికాప్టర్ ద్వారా జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ కు 10.30 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.45 గంటలకు కళాశాల గ్రౌండ్‌కు చేరుకొని ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఎగ్జిబిషన్ పరిశీలించి 12.45 గంటల వరకు బహిరంగ సభ లో మాట్లాడతారు. 12.55గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి 1.10 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరు కుంటారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పావుగంట ముందుగా 10.15 నిమిషాలకు జేఎన్‌టీయూ సమీపంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి వనమహోత్సవ ప్రదేశానికి చేరుకొని ముఖ్యమంత్రితో కలిసి వన మహోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.40 గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి 1.25గంటలకు మంగళగిరి క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారు.

600 మందితో బందోబస్తు

ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని 600 మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠితో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అనుచరులతో కలిసి పరిశీలించారు. ఎస్పీని కలిసి వివరాలు తెలుసుకున్నారు.

ఆర్భాటాలకు దూరంగా సీఎం సభ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు హంగు, ఆర్భాటాలు లేకుండా జిల్లాలో ముఖ్యమంత్రి బహిరంగ సభకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. జేఎన్‌టీయూలో శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేవలం ఐదారు వేలలోపు స్థానిక ప్రజానీకం మధ్య వనమహోత్సవం సీఎం ప్రారంభిస్తారన్నారన్నారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు నగర సిటీ ప్లానర్‌గా రాంబాబు

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ సిటీ ప్లానర్ (సీపీ) గా డి. రాంబాబును నియమిస్తూ ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా, ఇప్పటి వరకు గుంటూరు సీపీగా పనిచేసిన పి.ప్రదీప్‌కుమార్ కర్నూలు వెళ్లారు. ఏపీ సీఆర్‌డీఏలో జాయింట్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్(జేడీటీపీ)గా పనిచేస్తున్న రాంబాబు గుంటూరు సిటీ ప్లానర్‌గా రానున్నారు.

ప్రకటనల మాయాజాలం

- హోర్డింగ్స్ పేరుతో దోపిడీ
- నిబంధనలకు తిలోదకాలు
- సీసీ కెమెరాలు, సిగ్నల్ కూడా పెట్టని వైనం
- కార్పొరేషన్‌కి రూ. కోట్లలో బకాయిలు పడ్డ యాడ్ ఏజెన్సీలు
- టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కు



లక్ష్మీపురం సెంటర్‌లో బస్‌బే

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నగరంలో హోర్డింగ్ మాయజాలం నడుస్తోంది. ఎటు చూసినా పెద్దపెద్ద ప్రకటనల హోర్డింగ్స్ కనిపిస్తుంటాయి. అయితే, వీటి నిర్వహణకు నిర్వాహకులు నగరపాలక సంస్థకు కొంత రుసుం చెల్లించాల్సి ఉన్నా అడ్డదారులు తొక్కుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో లాలూచీ పడి అక్రమాలకు పాల్పడుతున్నారు. కార్పొరేషన్ స్థలాల్ని దర్జాగా వాడుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కౌన్సిల్ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు ప్రశ్నలు లేవనెత్తడంతో దోపిడీ బట్టబయలైంది. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో హోర్డింగ్స్ పేరుతో జరుగుతున్న అవినీతి బయటపడింది.

రూ. కోట్లలో బకాయిలు

నగరంలో అధికారికంగా 1400, అనధికారికంగా 4వేలకు పైగా హోర్డింగ్స్ ఉన్నట్లు అంచనా. ఇందులో టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు ఉన్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కొంత మంది యాడ్ ఏజెన్సీలతో కుమ్మకై వాటిని దగ్గరుండి నిర్వహించుకునేందుకు అన్ని అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అనుమతులున్న బోర్డులకు కూడా అధికారులు నిర్వాహకులు నుంచి బకాయిలు వసూలు చేయడం చేతకావడం లేదు. పైగా వారే యాడ్ ఏజెన్సీ నిర్వాహలకు బకాయిలు కట్టకుండా కోర్టులకు వెళ్లండి ! అంటూ సూచనలు చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇందులో 10 మంది యాడ్ ఏజెన్సీ నిర్వాహకులు కోర్టులకు వెళ్లడం గమనార్హం. వీరి నుంచి కార్పొరేషన్‌కు రూ.2కోట్ల బకాయిలు ఉన్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి.

దర్జాగా అద్దెకు కార్పొరేషన్ స్థలాలు

నగరంలో 35 గ్యాంట్రీ బోర్డులు ఏర్పాటు చేసుకునేందుకు ఓ యాడ్ ఏజెన్సీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో 21 చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ఇందుకు గానూ నగరపాలక సంస్థ స్థలాల్ని వారికి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటిల్లో సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్ నిర్వహణ, డ్రింకింగ్ వాటర్, ఫ్యాన్లు, ట్రాఫిక్ స్లోగన్ వంటి సదుపాయాలతో యాడ్ ఏజెన్సీ నిర్వాహకులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ నగరంలో ఇవి ఎక్కడా కనిపించడం లేదు. నగరంలో అత్యంత విలువైన ప్రాంతాలైన అమరావతి రోడ్డు, అరండల్‌పేట, లక్ష్మీపురం ప్రాంతాల్లో కార్పొరేషన్ స్థలాల్ని తీసుకుని వాటిలో వ్యాపార కార్యకలాపాల్ని నిర్వహించుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. కార్పొరేషన్ స్థలాల్లో నిర్మాణాలకు తీసుకునే అనుమతులు ఒకటి ..కట్టే నిర్మాణాలు మరొకటిగా ఉంది. ఇక్కడ కూడా అధికారులు యాడ్ ఏజెన్సీలకు అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. స్థలాల్ని వ్యాపార అవసరాల కోసం వినియోగించుకుంటున్నారని, ఒప్పందంలో చేసుకున్న పనుల్ని ఒక్కటీ చేయడం లేదని కౌన్సిల్‌లో ప్రశ్నలు లెవనెత్తిన కార్పొరేటర్లకు అధికారులు సమాధానం ఇవ్వలేక ఉత్సవ విగ్రహాలులా నిలబడుతున్నారు.



అమరావతి రోడ్డులో హోర్డింగ్

> **అడుగుల పేరు చెప్పి మీటర్లలో ఏర్పాటు**
>
> నగరంలో గ్యాంట్రీ హోర్డింగ్స్ అనుమతులు అడుగుల్లో తీసుకుని నిర్వాహకులు తర్వాత మీటర్లలోకి మారుస్తున్నారు. దీని వల్ల నగరంలో పలు ప్రధాన కూడళ్ల వద్ద హోర్డింగ్స్ భయానకంగా మారే పరిస్థితి నెలకొంది. బలమైన ఈదురు గాలులు వీస్తే కూలిపోయి ప్రజలపై పడితే ఎవరూ బాధ్యత వహిస్తారని డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు, కార్పొరేటర్లు పీచంపాటి ఆచారి, అచ్చాల వెంకటరెడ్డి, రోషన్ తదితరులు కౌన్సిల్ అధికారుల్ని ప్రశ్నించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, హోర్డింగ్స్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు




ప్రమాదంలో మృతి చెందిన అంకమ్మరావు

ప్రత్తిపాడు: హైవేపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గుంటూరు నగరం శ్రీనివాసరావు కాలనీకి చెందిన కుంచాల అంకమ్మరావు (39), తన స్నేహితులు మల్లెల మూర్తి, చల్లా శ్రీనివాసరావు, లలాం చిరంజీవిలు గురువారం మధ్యాహ్నం పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని గణపవరంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లేందుకు గుంటూరు నుంచి కారులో బయల్దేరారు. చల్లా శ్రీనివాసరావు తోలుతుండగా అతడి పక్కన కుంచాల అంకమ్మరావు కూర్చున్నాడు. మార్గం మధ్యలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెం సమీపంలో హైవేపై మొక్కలు నాటుతూ పక్కన నిలిపి ఉంచిన మెయింటెనెన్స్ ట్రాక్టర్‌ను వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింటది. అందులో ప్రయాణిస్తున్న అంకమ్మరావు తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మూర్తి, శ్రీనివాసరావు, చిరంజీవిలు తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్‌ఐ కె. నాగేంద్ర ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.

తెలుగు భాషకు గిడుగు సేవలు అద్భుతం

> కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, అధికారులు

గుంటూరు వెస్ట్: తెలుగు భాషాభివృద్ధికి గిడుగు వెంకట రామ్మూర్తి సేవలు అద్భుతమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తెలుగు భాషకు గిడుగు చేసిన సేవలకు గాను ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. తెలుగు భాష నిర్లక్ష్యానికి గురి కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగువారందరిపైనా ఉందని తెలిపారు. సమాజ ఉన్నతికి మహనీయులు చేసిన త్యాగాలు, సేవల్ని నేటి యువతరం తెలుసుకోవాలని సూచించారు. అనంతరం డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, శివపార్వతి, జీఎంసీ అడిషన్ కమీషనర్ లక్ష్మీ రాజ్యం, డీపీఓ శ్రీదేవి, అధికారులతో కలిసి గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు.

అక్టోబర్ 29న ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ పబ్లికేషన్

జిల్లాలో ఎస్ఎస్ఆర్- 2025కు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియలను పూర్తి చేసి అక్టోబర్ 29న ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ పబ్లిష్ చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఎల్వోలు ఓటరు కార్డుల ఇంటింటి వెరిఫికేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 20 నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఓటరు పెండింగ్ దరఖాస్తులను పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. మరణించిన, అడ్రస్ మారిన వారి సమస్యలు పరిష్కరించి అక్టోబర్ 18 నాటి కల్లా నమోదు చేయాలని తెలిపారు. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో పటిష్టంగా పనిచేయాలని, ఇంకా పని ప్రారంభించని వారికి నోటీసులు జారీ చేయాలని తెలిపారు. ఒకే ఇంటిలో నివసించే వారి ఓట్లన్నీ సమీపంలోని ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం: రూ.6,000 గరిష్ఠం: రూ.7,200

మోడల్ ధర రూ.6,600

శిక్షలు కఠినంగా అమలు చేయాలి



కోల్‌కత్తా మెడికల్ కళాశాలలో విధి నిర్వహణలో ఉన్న మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నేరస్తులు తప్పించుకోకూడదు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేసి కఠిన శిక్షలు అమలు చేయాలి. అప్పుడే భవిష్యత్‌లో ఇటువంటి ఘోరాలు జరగకుండా ఉంటాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో పోలీసుల రక్షణతోపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఎల్లప్పుడూ ఉండాలి. ఐఎంఏ బాధ్యత తీసుకొని ప్రభుత్వాలు అమలుచేసేలా పోరాటం చేయాలి.

–డాక్టర్ కె.వసంతరాయ, గైనకాలజిస్టు, నరసరావుపేట



డాక్టర్లకు రక్షణ కరువు

విధి నిర్వహణలో రోగుల ప్రాణాలు రక్షించే డాక్టర్లకు నేడు భద్రత లేదు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఘటనలో నేరస్తులకు చట్టంలో కఠినమైన శిక్షలు లేకపోవడం దారుణం. ఇటీవల తిరుపతి స్విమ్స్‌లో జూనియర్ డాక్టర్‌పై పేషెంట్ బంధువులు దాడి చేయడం గర్హనీయం. పగలు, రాత్రీ అని తేడా లేకుండా విధులు నిర్వహించే మహిళా డాక్టర్లు, సిబ్బందికి రక్షణగా అడిషనల్ ఫోర్స్ ఉండేలా పూర్తి స్థాయిలో చట్టం తీసుకురావాలి.

– డాక్టరు పోతునూరి స్వప్న, సామాజిక ఆరోగ్యకేంద్రం, కొల్లిపర



క్లుప్తంగా

గుంటూరు రేంజ్‌లో మరో ఐదుగురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల జిల్లా డీటీసీ సీఐ సీహెచ్.సింగయ్యను గుంటూరు జిల్లా పశ్చిమ ట్రాఫిక్ పీఎస్‌కు, ఏసీబీ సీఐ బి.రవీంద్రబాబును గుంటూరు జిల్లా ఫిరంగిపురం పీఎస్‌కు, గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.భాస్కర్‌ను పల్నాడు జిల్లా గురజాల పీఎస్‌కు, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్ట్ సర్కిల్ సీఐ కె.వెంకటరెడ్డిని ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా దక్షిణ ట్రాఫిక్ పీఎస్‌కు, గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న కె.రామకృష్ణను ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా ఉత్తర ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేశారు.

తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా మహాలక్ష్మీపతిరావు

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా వి.మహాలక్ష్మీపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. మంగళగిరి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఇప్పటి వరకు తెనాలి అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన అనూష కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు

తెనాలి రూరల్: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వేమూరు మండలం చావలికి చెందిన సోమరౌతు సింధుజయేంద్రప్రసాద్ అలియాస్ సింధురాజ్ అదే గ్రామానికి చెందిన సోమరౌతు సాంబయ్య వద్ద అప్పుడప్పుడూ డబ్బులు తీసుకుంటుండేవాడు. తిరిగి ఇవ్వక పోగా ఇంకా కావాలని అడగడంతో సాంబయ్య ఇచ్చేందుకు నిరాకరించాడు. పొలం నుంచి ఇంటికి వస్తున్న అతడ్ని డబ్బు ఇస్తానని చెప్పి సింధురాజ్ ఇంటికి తీసుకెళ్లి చాకుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుడు ఇంటి నుంచి బయటకు వచ్చి కొంతదూరంలో పడిపోగా స్థానికులు వైద్యశాలకు తరలించారు. వేమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్ నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏఈపీపీ ఎలిజబెత్‌రాణి వాదించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

దాచేపల్లి: నడికుడి రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వేస్టేషన్‌లోని 3వ నంబర్ ప్లాట్‌ఫారం పక్కన ఉన్న పట్టాలపై సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి తలపెట్టి పడుకున్నాడు. గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళుతున్న రైలు పట్టాలపై పడుకున్న వ్యక్తిపై నుంచి వెళ్లింది. శరీరం నుంచి తల విడిపోయింది.

ఆర్‌బీఐ క్విజ్ పోటీలో విద్యార్థులంతా పాల్గొనాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ క్విజ్‌లో ఇద్దరు విద్యార్థులు కలిసి బృందంగా ఏర్పడి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 186 కళాశాలలు, ఎనిమిది యూనివర్సిటీల విద్యార్థులంతా పాల్గొనాలని ఆమె తెలిపారు. రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఫైనల్ విజేతకు రూ.10 లక్షలు, ద్వితీయ స్థానానికి రూ.8 లక్షలు, తృతీయ స్థానానికి రూ. 6 లక్షలతోపాటు అనేక బహుమతులుంటాయని కలెక్టర్ చెప్పారు.



క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్

ఏఎన్‌యూలో అధికారులకు ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘ నాయకులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్ నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ బి. శేఖర్‌బాబును ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు అడ్డుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఎగ్జామ్‌ను షెడ్యూల్ ప్రకారం గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరపాలి. సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్దేశించిన షెడ్యూల్ కంటే ముందు ఉదయం 10 గంటలకే నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సమాచారం తెలుసుకున్నారు.ఈ విషయంపై డిపార్టుమెంట్ కోఆర్డినేటర్‌ను వివరణ కోరగా విద్యార్థి రిక్వెస్ట్ చేయడంతో షెడ్యూల్ కంటే ముందే జరపాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. ఎగ్జామ్ రాస్తున్న విద్యార్థిని అడుగ్గా తాను అడగలేదని తెలిపాడు. నాయకులు విషయాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి తీసుకుని వెళ్లగా, ఆయన రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయమని సూచించారు. నాయకులు విషయాన్ని ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్, రెక్టార్, రిజిస్ట్రార్‌ల వద్దకు తీసుకుని వెళ్లి సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై యూనివర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో సమస్యలు ఉన్నాయని, ఈ విషయంతో పాటు వాటి మీద కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థి నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎఫ్ ప్రెసిడెంట్ రత్నసాగర్, సెక్రటరీ గణేష్, వైస్ ప్రెసిడెంట్ రత్న కిశోర్, ట్రెజరర్ మధు, నాయకులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి వీసీకి ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

8న మిస్టర్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా ఫిట్‌నెస్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 8న మిస్టర్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు, రాష్ట్రస్థాయి కెటిల్‌బెల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం పోటీలు జరిగే స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆవిష్కరించారు. ప్రతి అసోసియేషన్ విధిగా క్రీడా పోటీలు నిర్వహించాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో నాగ గౌతమ్, ఎండీ జావెద్ అహ్మద్, డాక్టర్ సతీష్, రాజ్ కుమార్, అభిషేక్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

రెంటచింతల: రెంటచింతలలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామంలోని లూర్దు మాత మందిరం సమీపంలోని ఓ సందులో రాత్రి 12 గంటల తర్వాత వాహనం దగ్ధం కావడంతో చుట్టు ప్రక్కల వారు ఆ మంటలకు లేచి చూసే సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడం గమనించారు. ఆ ద్విచక్ర వాహనం పక్కనే మండవ రామారావుకు చెందిన కారుపై కప్పిన పట్టాకు కూడా నిప్పు అంటుకోవడంతో వెంటనే నీళ్లు పోసి అదుపులోకి తెచ్చారు. ఈ ద్విచక్రవాహనం ఎవరిదో ఇప్పటి వరకు ఆచూకీ తెలియని పరిస్థితి. గ్రామంలో జరిగిన ఈ ఘటన వల్ల ఆరుబయట బైక్‌లను పార్కింగ్ చేసే వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు.

రసవత్తరంగా కృష్ణా, పశ్చిమగోదావరి మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్–23 క్రికెట్ పోటీల్లో భాగంగా కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య మ్యాచ్ రసవత్తరంగా మారింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు నిన్నటి ఓవర్ నైట్ స్కోర్ ఐదు వికెట్లు నష్టానికి 266 పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించి 331 పరుగులకు ఆలౌట్ అయింది. కృష్ణా బ్యాట్స్‌మెన్‌లు సుశాంత్‌నాయుడు 86, అనంత్‌కార్తికేయ 61, శ్రీనిశ్చయ్ 59 పరుగులు సాధించారు. పశ్చిమగోదావరి బౌలర్లు దీపక్‌చంద్ 4, పి.భువనేశ్వర్ 3 వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్లు నష్టానికి 172 పరుగులు చేసింది. జట్టులోని హరిష్ 57 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్లు సుశాంత్‌నాయుడు, ఆదర్శ్ చెరో రెండు వికెట్లు సాధించారు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.



దీపక్‌చంద్,4 వికెట్లు

మేటి క్రీడాకారులుగా ఎదగాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడలపై ఆసక్తితో మేటి క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత విద్యా సంవత్సరంలో క్రీడల్లో ఎక్కువ మందిని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఆడించి, జిల్లా స్థాయిలో అత్యుత్తమంగా నిలిచిన ఐదు పాఠశాలలకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో భాగంగా నారాకోడూరు, నూతక్కి, ఉప్పలపాడు, కొత్రపాడు, మందపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గత కొన్నేళ్లుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో క్రీడా ప్రతిభా పురస్కారాల్ని అందజేస్తోందన్నారు. ఇందులో భాగంగా 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఐదు పాఠశాలలకు ప్రదానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎం.రవి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, ఆర్ఐపీఈ బాషా, సంఘ జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. వెంకటేశ్వరరావు, రమేష్, అశోక్ పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న వ్యాయామ ఉపాధ్యాయులతో డీఈవో శైలజ

భాషను సామాన్యుల చెంతకు చేర్చిన గిడుగు

ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు భాష పండితుల నుంచి నుంచి పామరులకు చేరాలనే ఆశయంతో గిడుగు రామ్మూర్తి పంతులు గ్రాంథిక భాషను కాదని వ్యవహారిక భాష కోసం ఉద్యమం చేసి విజయం సాధించారని సుప్రసిద్ధ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దయానంద్ మాట్లాడుతూ గిడుగు సవర జాతికి లిపిని తయారు చేసేందుకు జీవితాన్ని అంకితం చేసి తీవ్ర కష్టనష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. ఆయన కృషిని నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని తెలుగు భాషను రక్షించుకోవాలని సూచించారు. ప్రముఖ రచయిత కందిమళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నెలకొకటి చొప్పున ఎన్నో వందల పద్యాలను సులువుగా నేర్చుకోవచ్చని తెలిపారు. కళాశాల విద్యా విషయక సమన్వయకర్త డాక్టర్ కె. కాళిదాసు మాట్లాడుతూ తెలుగు ముందుగా నేర్చుకుంటే ఆంగ్లం వంటి పరి భాషలు సులువుగా వంట పడతాయని సూచించారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, అధ్యాపకులు ఆలూరి నటరాజ కుమారి, తపతీ కిరణ్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా డిగ్రీ ప్రథమ సెమిస్టర్‌లో తెలుగులో అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థినికి కళాశాల పూర్వ కార్యదర్శి మాజేటి వేంకట రామకోటి ముత్యాలు ప్రకటించిన ఆర్థిక పురస్కారాన్ని అందజేశారు.



దయానంద్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

విజ్ఞాన్‌లో జాతీయ క్రీడా దినోత్సవం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ముందుగా జాతీయ జెండాతో భారీ ర్యాలీ చేపట్టారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడల్లో దేశానికి వరుసగా మూడు సార్లు స్వర్ణపతకాలను అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కుతుందన్నారు. ఆయన పేరుమీదనే భారత ప్రభుత్వం క్రీడల్లో అత్యున్నత పురస్కారమైన 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డును క్రీడాకారులకు అందజేస్తుందన్నారు. విద్యార్థులందరూ ఆటల్లో పాల్గొనాలనే ఉద్దేశంతో విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడు సెమిస్టర్‌లలో స్పోర్ట్స్‌కు సంబంధించిన అంశాలకు మార్కులు కూడా కేటాయించామన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, అనుకున్నది సాధించేదాక కష్టపడి పనిచేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎప్పుడు కూడా నిర్లక్ష్యంగా ఉండకుండా... ఎప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

క్రీడాకారులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్ జీవితంలో గెలుపోటములు సహజమనే విధానం క్రీడల్లో చూడగలమని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి స్థానిక బి.ఆర్.స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగు రోజుల నుంచి నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు జేసీతోపాటు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నసీర్ అహ్మద్ మాట్లాడుతూ స్టేడియం క్రీడాకారులతో కళకళలాడాలన్నారు. ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ఎమ్మెల్యే భర్తను కావడంతోనే ఆరోపణలు

భ్రమర టౌన్‌షిప్ అధినేత గల్లా రామచంద్రరావు

గుంటూరు రూరల్: తమపై కావాలని కొన్ని మీడియా సంస్థలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని భ్రమర టౌన్‌షిప్స్ అధినేత గల్లా రామచంద్రరావు ఆరోపించారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని టౌన్‌షిప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము పిడుగురాళ్లలో ఎన్నో వెంచర్లు వేశామని తెలిపారు. కమ్మ వెంకటరావు వడ్డీ వ్యాపారని, అతనికి చల్లా రమేష్ మధ్య లావాదేవీలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో తాము రమేష్‌కు ఇచ్చిన చెక్కులను వెంకటరావు తీసుకుని చీటింగ్ చేశారని ఆరోపించారు. తాము ఇచ్చిన చెక్కులపై వెంకటరావు రూ.48 లక్షలు రాసుకుని, చెక్కులు బౌన్స్ చేశారని వివరించారు. ఆ సమయంలో వెంకటరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు తమను ఇబ్బందులు పెడుతుంటే పోలీసుల్ని ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. పైగా తమనే ఇబ్బందులు పెట్టారని , దీంతో డీఎస్పీకి రిజిస్టర్ పోస్ట్ ద్వారా అప్పట్లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తాము వివాదాలకు ఎల్లప్పుడూ దూరంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం వచ్చిందని, తన భార్య ఎమ్మెల్యేగా ఉన్నందునే బురద జల్లుతున్నారని గల్లా వివరించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు స్విమ్మర్లు

నరసరావుపేటఈస్ట్: జాతీయస్థాయి ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి ఇద్దరు స్విమ్మర్లు ఎంపికైనట్లు పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 25వ తేదీన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన 10వ సీనియర్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనపరిచిన ఎస్.జగదీష్ (స్విమ్మింగ్), ఎస్.మానసకుమార్ (వాటర్ పోలో) పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కర్నాటక రాష్ట్రం మంగుళూరులో సెప్టెంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలో జగదీష్ స్విమ్మింగ్ పోటీలోనూ, కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో సెప్టెంబర్ 18 నుంచి 22వ తేది వరకు జరగనున్న జాతీయస్థాయి వాటర్ పోలో పోటీలో మానసకుమార్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కోచ్ జి.సురేష్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



మెప్మాలో ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

మరొకరు విధుల నుంచి తొలగింపు

పొన్నూరు: పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)లో అక్రమాలకు పాల్పడిన ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేయడంతో పాటు మరొకరిని శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తూ ఎండీ భార్గవ్ తేజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన ఐదు మహిళా పొదుపు సంఘాలకు సంబంధించి వారి ప్రమేయం లేకుండా స్థానిక మెప్మా సిబ్బంది అక్రమంగా బ్యాంకులలో రూ.లక్షలు రుణాలు పొంది స్వాహా చేశారు. బాకీలు చెల్లించాలని మహిళా సభ్యులకు బ్యాంకుల నుంచి నోటీసులు అందడంతో ఆందోళనకు గురైన మహిళలు మెప్మా ఉన్నతాధికారుల్ని ఆశ్రయించారు. తమకు జరిగిన అన్యాయంపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. పొదుపు మహిళా సంఘాలకు జరిగిన అన్యాయాన్ని అనేక కథనాల ద్వారా సాక్షి పత్రిక వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ విషయంపై పీడీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు శాఖ అధికారులు వారం రోజుల పాటు పొన్నూరులో పూర్తిస్థాయిలో విచారణ చేశారు. సిబ్బంది అక్రమాలపై తుది నివేదికను మెప్మా ఎండీకి అందజేశారు. అక్రమాలకు పాల్పడిన వ్యవహారంలో పొన్నూరు సీఎంఎం మేరి జ్యోత్స్న, సీఓలు ఉషారాణి, జ్యోతి సస్పెండ్ అయ్యారు. ఆర్పీ సంధ్యను పూర్తిస్థాయిలో మెప్మా లాగిన్ నుంచి తొలగించినట్లు గుంటూరు కార్యాలయం ఏఓ ఉషా కిరణ్ తెలిపారు.

అపరిశుభ్రతకు నెలవుగా 'అన్న' క్యాంటీన్





పేదల ఆకలి తీర్చేందుకు ఎంతో ఆర్భాటంగా గుంటూరు చుట్టుగుంట కూడలిలో పునః ప్రారంభించిన 'అన్న క్యాంటిన్' అదనపు రోగాలకు నిలయంగా మారింది. క్యాంటీన్ లోపల భోజనం తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన దారి ప్రమాదభరితంగా మారింది.దాని కింద భాగాన ప్రధాన డ్రైనేజీ కాల్వ ప్రవహిస్తోంది. ఎక్కువ మంది దానిపై వెళ్తే ఏక్షణానైనా కూలుతుందోనని పేదలు జంకుతున్నారు. దీనికితోడు మురుగునీరు అక్కడే నిలిచిపోతోంది. దానిపై ఈగలు, దోమలు వాలుతున్నాయి. భోజనం తినే సమయంలో భరించలేని దుర్వాసన వెలువడుతుందని పలువురు వాపోతున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడంలేదు. దీంతో ఆకలి తీర్చుకునేందుకు వస్తే అదనపు రోగాలు వస్తాయని భయపడిపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వాపోతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు